సిద్ధమైన సెంట్రల్ లైబ్రరీ

- రాయలసీమ విశ్వవిద్యాలయంలో రూ.8.45 కోట్లతో నిర్మాణం
- రూ.2.5 కోట్లతో మౌలిక వసతులు కల్పన
- విద్యార్థులకు అందుబాటులోకి రానున్న వేలది పుస్తకాలు
- ఒకేసారి 400 మంది చదువుకునేలా సదుపాయం
- వచ్చే నెలలో ప్రారంభానికి వర్సిటీ అధికారులు కసరత్తు




ఆర్‌యూలో నూతనంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గ్రంథాలయ భవనం, లైబ్రరీ లోపల ఏర్పాటు చేసిన బుక్ స్టాక్ ర్యాక్‌లు

కర్నూలు(న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంటర్ లైబ్రరీ ప్రారంభానికి సిద్ధమవుతోంది. రూ.8.45 కోట్లతో నాలుగు అంతస్తుల్లో నిర్మించిన ఈ భవనంలో రూ. 2.5 కోట్లతో అత్యాధునిక సదుపాయాలు కల్పించారు. జూలైలో ఈ కొత్త గ్రంథాలయాన్ని ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని యూవర్సిటీ యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

అందుబాటులోకి 42 వేలు పుస్తకాలు :

డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సెంటర్ లైబరీలో 42 వేల పుస్తకాలు విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి. టైటిల్ బుక్స్ 12వేలు, నేషనల్, ఇంటర్ నేషనల్ జర్నల్స్ 19 ఉన్నాయి. అలాగే న్యూస్ పేపర్స్ 14, తెలుగు, ఇంగ్లిషు మ్యాగజైన్స్ మరో 18 ఉన్నాయి. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 6 వేల పుస్తకాలు ఉన్నాయి. యూనివర్సిటీలో దాదాపు 2 వేల మంది విద్యార్థులు ఉన్నారు. కొత్త గ్రంథాలయంలో ఒకేసారి 400 మంది విద్యార్థులు చదువుకోవచ్చు. లైబ్రరీలో ఆన్‌లైన్ పుస్తకాలు, ఇంటర్ నెట్, వైఫై సౌకర్యంతో పాటు ప్రతి సెక్షన్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నేషనల్ డిజిటల్ లైబ్రరీ (ఎన్‌డీఎల్)లో విద్యార్థులు మెయిల్ ఓపెన్ చేయగానే వారికి కావాల్సిన పుస్తకాలు, సమాచారం వస్తుంది.

సీమ జిల్లాలోనే అతిపెద్ద లైబ్రరీ

రాయలసీమ జిల్లాల్లోని పలు వర్సిటీల్లో గ్రంథాలయాలు ఉన్నాయి. అయితే, ఆర్‌యూలో కొత్తగా నిర్మించిన గ్రంథాలయ భవనం అతి పెద్దది. ఏకంగా నాలుగు అంతస్తులతో దీనిని నిర్మించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమైన ఆర్‌ఎఫ్ఐడీ టెక్నాలజీని తిరుపతి ఐఐటీ తరువాత ఇక్కడే ఏర్పాటు చేశారు. ఈ గ్రంథాలయంలో కొత్తగా సోల్ సాఫ్ట్‌వేర్ ఉపయోగించనున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో పెద్ద సెమినార్ హాల్ ఉండడంతో ఎక్కువ మంది విద్యార్థులు కూర్చొని ఆడియో, వీడియో విజువల్స్ చూడవచ్చు. సెంట్రల్ ఏసీ సదుపాయం ఉంది.

8 సెక్షన్లు

విద్యార్థులు చదువుకోడానికి లైబ్రరీలో ఎనిమిది సెక్షన్లు ఏర్పాటు చేశారు. 1.సర్క్యులేషన్ 2.ఆక్యూజేషన్ 3.ప్రాసెసింగ్, 4. పీరియాడికల్ 5.డిజిటల్ 6.రెఫరెన్స్ 7.బ్యాక్ వాల్యూమ్ డిజిటెక్షన్ 8.స్టాక్ ఏరియా సెక్షన్లు ఉన్నాయి. అలాగే సర్వీసు సెక్షన్‌లో విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులు, చదువుకోవడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.



గ్రంథాలయంలో రీడింగ్ హాల్

మాకు ఎంతో ఉపయోగం



అధ్యాపకులు చెప్పిన పాఠ్యాంశాల్లో ఏవైనా అర్థం కాకపోయినా, అదనపు సమాచారం కావాలన్నా లైబ్రరీలో లభిస్తుంది. కొత్త గ్రంథాలయాన్ని ఆధునిక సదుపాయాలతో ఏర్పాటు చేయడంతో ఈ -పుస్తకాలు, మ్యాగజైన్లు, ఈ- జర్నల్స్, న్యూస్ పేపర్లు అందుబాటులో ఉంటాయి. ఎక్కువ సమయం చదువుకోవడానికి కేటాయించవచ్చు. పోటీ పరీక్షల్లో రాణించేందుకు ఈ లైబ్రరీ మాకు ఎంతో ఉపయోగపడుతుంది. **– ఎస్.ఏథేర్‌రాణి, ఎంఎస్సీ జువాలజీ, మొదటి సంవత్సరం**

పుస్తకాలతో స్నేహం చేయాలి



వర్సిటీకి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సెంట్రల్ గ్రంథాలయం గుండె వంటిది. విద్యార్థులు, పరిశోధకులు ఈ గ్రంథాలయాన్ని వినియోగించుకుని ప్రతిభావంతులుగా తయారు కావాలి. ప్రతి విద్యార్థి పోటీ పరీక్షలకు సిద్ధమై ఉద్యోగాలు సాధించాలి. ఖాళీ సమయంలో గ్రంథాలయంలో పుస్తకాలతో స్నేహం చేయడం అలవాటు చేసుకోవాలి. కొత్త లైబ్రరీని త్వరలోనే ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తాం. **– ఎ.ఆనందరావు, ఉపకులపతి, రాయలసీమ విశ్వవిద్యాలయం**

క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరాలు పేదలకు ఉపయోగం



బీపీ చెక్ చేయించుకుంటున్న మాజీ ఎంపీ బుట్టా రేణుక

కర్నూలు(హాస్పిటల్): ఉచిత వైద్యశిబిరాలు పేదలు, నిరుపేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని మాజీ ఎంపీ బుట్టా రేణుక చెప్పారు. నక్కలమిట్ట ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన వారికి ఈసీజీ, బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించి తగు సూచనలు, సలహాలను వైద్యులు అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు నక్కలమిట్ట శ్రీనివాసులు, బహుజన విద్యావంతుల వేదిక రాష్ట్ర నాయకులు జీవీ కృష్ణయ్య, ఏపీ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ముపాలెం శ్రీనివాసులు, ఆర్‌పీఎస్, ఆర్‌టీఐ, ఏపీ ఎంఆర్‌పీఎస్, బీసీసంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

దేవాలయాల ఆస్తుల రక్షణకు చర్యలు

కర్నూలు కల్చరల్: దేవాలయాల ఆస్తుల రక్షణకు చర్యలు తీసుకోవాలని ఆ శాఖ సహాయ కమిషనర్ రామాంజనేయులు ఆదేశించారు. శుక్రవారం ఆ శాఖ కార్యాలయంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్లు, కార్యనిర్వహణాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఓల పరిధిలోని ఆలయాల భూములు, స్థలాలు, తదితర ఆస్తులను అప్‌డేట్ చేయాలన్నారు. ఆలయాల్లో ప్రాపర్టీ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దేవాలయాల భూములకు వేలం , లీజ్ రుసుం వసూలు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఆలయాల ఆస్తులు ఆక్రమణకు గురికాకుండా చూసుకోవాలన్నారు. చాలా చోట్ల ఆలయాల మాన్యం భూములు ఇతరులు రిజిస్ట్రేషన్ చేయించుకోవడం, అమ్ముకోవడం, నిర్మాణాలు చేసుకోవడం లాంటి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీనిపై ఈఓలు దృష్టి సారించాలన్నారు. కర్నూలు, ఆదోని డివిజన్ల ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, ఈఓలు పాల్గొన్నారు.

సమన్వయంతోనే ఎయిడ్స్ నివారణ సాధ్యం



ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో వివరాలు సేకరిస్తున్న డాక్టర్ కామేశ్వరప్రసాద్

కర్నూలు(హాస్పిటల్): అందరూ సమన్వయంతో పనిచేస్తేనే ఎయిడ్స్ నివారణ సాధ్యమవుతుందని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సంయుక్త సంచాలకులు డాక్టర్ కామేశ్వరప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఐసీటీసీ, పీపీటీసీటీ, ఎస్‌ఆర్‌ఎల్ అండ్ ఏఆర్‌టీ సెంటర్‌ను పరిశీలించారు. హెచ్ఐవీ పరీక్షలు చేసే కేంద్రాలను, గర్భిణులకు, హెచ్ఐవీ బాధితులకు అందిస్తున్న కౌన్సెలింగ్, మందులు, వ్యాక్సిన్, రక్తపరీక్షలు, కావాల్సిన పరి కరాలు, సరఫరాపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితులకు అవసరమైన అన్ని రక్త పరీక్షలు చేయాలని సూచించారు. గర్భిణులకు ప్రత్యేక కౌన్సిలింగ్ చేయాలని, టీబీ, చిన్నపిల్లల కు కావాల్సిన అన్ని సదుపాయాలు ఇవ్వాలని చెప్పా రు. అన్ని కేసులకు సంబంధించి అన్ని రకాల రిపోర్ట్స్ తనిఖీ చేశారు. ప్రతిరోజు అందరూ ఆన్‌లైన్ ద్వారా రిపోర్ట్స్ పంపాలని ఆదేశించారు. అనంతరం ఆయన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డిని కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా ఎయిడ్స్, లెప్రసి, టీబీ అధికారి డాక్టర్ ఎల్. భాస్కర్, జిల్లా మేనేజర్ అలీ హైదర్, దేవి శంకర్‌గౌడ్, రాష్ట్ర కార్యాలయం నుంచి సుకుమార్ ఉన్నారు.

సింగిల్ మేజర్ సబ్జెక్టుపై అవగాహన



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ ఆనందరావు

కర్నూలు (న్యూసిటీ) : డిగ్రీ కోర్సుల్లో సింగిల్ మేజర్ సబ్జెక్టుపై శుక్రవారం ఆర్‌యూలో అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, కరస్పాండెట్లకు వీసీ ఎ. ఆనందరావు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యావిధానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ మేజర్ డిగ్రీ కోర్సులు తీసుకొస్తుందన్నారు. ప్రస్తుతం డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరేవిధంగా అవగాహన కల్పించాలన్నారు. రిసోర్స్ పర్సన్, రాష్ట్ర ఉన్నత విద్యామండలి అకడమిక్ అధికారి డాక్టర్ శ్రీరంగం మాధ్యు మాట్లాడుతూ ఇంటర్ పాసైన విద్యార్థులకు నూతన విద్యావిధానం గురించి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య ఎన్‌టీకే నాయక్, వర్సిటీ అధికారులు, పాల్గొన్నారు.

ఈ రోజు

దేవదాయశాఖలో స్పందన

కర్నూలు కల్చరల్: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మద్దూరు నగర్‌లోని ఏసీ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దేవదాయ శాఖ సహాయ కమిషనర్ రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి, దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రతి శనివారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు, అర్చకులు దేవదాయ శాఖకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే వినతి పత్రాలు సమర్పించవచ్చని తెలిపారు.

స్వచ్ఛ మందిర్

కర్నూలు కల్చరల్: సాయిబాబా భక్త మండలి ఆధ్వర్యంలో దక్షిణ షిరిడీ సాయిబాబా దేవస్థానంలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని శనివారం ఉదయం 8 గంటలకు స్వచ్ఛ భారత్ – స్వచ్ఛ మందిర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండలి కార్యదర్శి మహా బలేష్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మన గుడిని శుభ్రం చేయనున్నట్లు పేర్కొన్నారు. సాయి భక్తులు, దీక్షాపరులు, ఆలయ పాలక మండలి సభ్యులు, సత్సంగ సభ్యులు కార్యక్రమంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు చోట్ల జరుగుతున్న అభివృద్ధి పనుల కారణంగా సంపత్ నగర్, మహావీర్ నగర్, చల్లవారి వీధి, తిలక్ నగర్, కొత్త బస్టాండ్ ఏరియా, ఇందిరాగాంధీ నగర్, కల్లూరు రోడ్డు, విద్యా నగర్ ఏరియా, సుంకేసులు రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్పోర్ట్స్

హ్యాండ్‌బాల్ క్రీడాభివృద్ధికి కృషి

కర్నూలు(రూరల్): ప్రపంచ హ్యాండ్‌బాల్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నగరంలోని ఔట్‌డోర్ స్టేడియంలో కర్నూలు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. జిల్లా క్రీడాశాఖ సీఈఓ రమణ మాట్లాడుతూ హ్యాండ్‌బాల్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. హ్యాండ్‌బాల్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రారెడ్డి, జాతీయ యోగా సంఘం శ్రీధర్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్‌లో రాణించాలి

హ్యాండ్‌బాల్ క్రీడలో రాణించా లని హ్యాండ్‌బాల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. హ్యాండ్‌బాల్ దినోత్సవా న్ని పురస్కరించుకుని నగరంలోని బి.క్యాంప్ క్రీడా మైదానంలో శుక్రవారం హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. హోరాహోరీగా జరిగిన చివరి మ్యాచ్‌లో విన్నర్‌గా శరీన్‌నగర్ జట్టు, రన్నర్‌గా కల్లూరు జట్టు నిలిచాయి. గెలుపొందిన జట్లకు రగ్బీ సంఘం సురేందర్, సర్జిమేడ్ డీలర్ సాయి రోహిత్ బహుమతులు ప్రదా నం చేశారు. ఆర్చరీ సంఘం నాయకులు నాగరత్నమయ్య, హ్యాండ్‌బాల్ సంఘం కార్య దర్శి సువర్ణ, రోప్ స్కిప్పింగ్ ప్రభాకర్, పీఈటీ చిన్నసుంకన్న పాల్గొన్నారు.

ముగిసిన ఫుట్‌బాల్ టోర్నమెంట్

నగరంలోని ఔట్‌డోర్ స్టేడియంలో నరసింహులు మెమోరియల్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీలు శుక్రవారం ముగిశాయి. శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆర్ఎస్ పెండేకల్ జట్టు తుంగభద్ర జట్టుపై (3-0)తో విజయం సాధించింది. ముగింపు కార్యక్రమానికి డీఎస్పీ యుగంధర్ బాబు హాజరై గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీఈఓ రమణ, కోచ్ బ్రహ్మకుమార్, జగదీష్, వేణుగోపాల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

32 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

కర్నూలు : ప్రభుత్వం తెల్ల కార్డుపై పేదలకు సరఫరా చేస్తున్న సబ్సిడీ బియ్యాన్ని నల్ల బజారుకు తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో విజిలెన్స్ అధికారులు నిఘా వేసి పట్టుకున్నారు. కురువ మహేష్ , ఎరుకలి కుమార్, భాస్కర్‌రెడ్డి తదితరులు ముఠాగా ఏర్పడి కొంతకాలంగా బియ్యం వ్యాపారం సాగిస్తున్నట్లు విజిలెన్స్ అధికారులకు తెలిసింది. వారిపై నిఘా వేసి శుక్రవారం బళ్లారి చౌరస్తా వద్ద బియ్యాన్ని తీసుకువెళ్తున్న లారీ (ఏపీ21 టీడబ్ల్యూ 7793)ని స్వాధీనం చేసుకున్నారు. 32 క్వింటాళ్ల సబ్సిడీ బియ్యం ఉండగా వాటిని సీజ్ చేసి నిల్వ నిమిత్తం పౌర సరఫరాల గోదాముకు అప్పగించారు. బియ్యం రవాణాదారులు ముగ్గురిపై చీటింగ్ అండ్ ఎస్సెన్షియల్ కమాడిటీస్ యాక్ట్‌లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం నాలుగో పట్టణ పోలీసులకు అప్పగించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

కర్నూలు : అపార్ట్‌మెంట్ పై నుంచి కింద పడి గాయాలపాలైన ఈడిగ సుబ్బారావు (65) కోలుకోలేక మృతిచెందాడు. ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామానికి చెందిన ఈయన ఆర్టీసీలో ఉద్యోగం చేస్తూ పదవీ విరమణ పొందాడు. దీర్ఘకాలిక జబ్బుతో కొన్నాళ్లుగా బాధ పడుతూ నంద్యాల రోడ్డులోని శిల్పా టౌన్‌షిప్‌కు ఎదురుగా ఉన్న బాయ్స్ హాస్టల్ పక్కన ఉన్న అపార్ట్‌మెంట్‌లో బంధువుల దగ్గర ఉంటున్నాడు. ఈనెల 16వ తేదీన అపార్ట్‌మెంట్ బాల్కనీలో నిలబడి బీడీ తాగుతూ ప్రమాదవశాత్తు కింద పడి గాయాలకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించగా కోలుకోలేక మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య

కర్నూలు: అక్రమ సంబంధం అంటగటి వేధింపులకు గురిచేస్తుంటే తాళలేక కర్నూలు గణేష్ నగర్‌లో నివాసముంటున్న పాలకిటి స్వాతి (23) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం శ్రీపతిరావు పేటకు చెందిన శ్రీనివాసులు కూతురు స్వాతిని గిద్దలూరుకు చెందిన సయ్యద్ బాబుకు ఇచ్చి ఆరేళ్ల క్రితం వివాహం జరిపించారు. కొంతకాలం సంసారం సాఫీగానే సాగింది. స్వగ్రామం గిద్దలూరు నుంచి ఉపాధి నిమిత్తం వీరు కర్నూలుకు వలస వచ్చి గణేష్ నగర్‌లో ఉంటున్నారు. కొంతకాలంగా భార్యపై అనుమానంతో వేధింపులకు గురిచేస్తుండటంతో శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. అల్లుడు సయ్యద్ బాబు వేధింపులకు తట్టుకోలేక తన కూతురు ఈ అఘాయిత్యానికి పాల్పడిందని తండ్రి పాలకిటి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. తర్వాత మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆత్మహత్యకు దారి తీసిన కారణాలపై విచారణ జరుపుతున్నట్లు సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

నిషేధిత గుట్కా సీజ్



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న విజిలెన్స్ అధికారులు

కర్నూలు : అక్రమ నిల్వలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు ముమ్మరం చేశారు. కల్లూరు మండలం ఓబులయ్య నగర్ (శరీన్ నగర్)లో నివాసముంటున్న బండి రాముడు అలియాస్ రాము ఇంట్లో పెద్ద ఎత్తున నిషేధిత గుట్కా, ఖైనీ, పొగాకు పదార్థాలు, పాన్ మసాలాలు నిల్వ ఉన్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం ఉదయం సేల్స్ ట్యాక్స్ అధికారులతో కలసి విజిలెన్స్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఎలాంటి అమ్మకపు బిల్లులు లేకుండా ప్రత్యేక గదిలో నిల్వ ఉంచిన సుమారు రూ.7.98 లక్షలు విలువ చేసే సరుకును సీజ్ చేశారు. ప్లాస్టిక్ సంచులు అట్ట పెట్టెల్లో ఉన్న వాటిని పరిశీలించి సెక్షన్ 35 ఆఫ్ ఏపీజీఎస్టీ ప్రకారం కేసు నమోదు చేసి సీజ్ చేశారు. విజిలెన్స్ సీఐ సునీల్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారి రూఫస్, సేల్స్ ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ సుబ్బారెడ్డి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రవికుమార్ దాడుల్లో పాల్గొన్నారు. హైదరాబాద్, ఆదోని ప్రాంతాల్లో కొనుగోలు చేసి ఎలాంటి బిల్లులు లేకుండా కొంత కాలంగా వ్యాపారం నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికీ లబ్ధి

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



పథకాల క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే

కర్నూలు(రాజ్‌విహార్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి పేద కుటుంబానికి లబ్ధి చేకూరిందని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక 13వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బంగారుపేట ప్రాంతాల్లోని వీధుల్లో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తర్వాత వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పథకాల ద్వారా కల్పిస్తున్న లబ్ధిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొందేందుకు ఎవరి సిఫార్సులు అవసరం లేదని చెప్పారు. సచివాలయ ఉద్యోగులు లేదా ఇంటికి వచ్చే వలంటీర్లను సంప్రదిస్తే చాలని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయలక్ష్మి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- జగనన్న సురక్ష కార్యక్రమంలో నగర మేయర్, కర్నూలు ఎమ్మెల్యే

కర్నూలు (టౌన్) : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని కర్నూలు నగర మేయర్ బివై.రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ స్పష్టం చేశారు. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలు నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో వీక్షించారు. కార్పొరేటర్లు, సచివాలయాల ఉద్యోగులు, పార్టీ నాయకులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నెల రోజుల పాటు జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందన్నారు. అర్హులై ఉండి పథకాలు అందని వారిని గుర్తించడం కోసం వలంటీర్ల ద్వారా ఇంటింటికి తిరిగి సర్వే చేస్తున్నట్లు చెప్పారు. పథకాల మంజూరులో ఏవైనా సమస్యలు ఉన్నా, ఇబ్బందులున్నా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైన వారికి జనన, మరణ, కుల, రేషన్ కార్డు డివిజన్, హౌస్ హోల్డ్ డివిజన్, ఇన్‌కమ్ తదితర 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. జూలై 1 నుంచి ప్రతి సచివాలయంలో ఈ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ, అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ పాల్గొన్నారు.



జగనన్న సురక్ష ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న నగర మేయర్ బీవై రామయ్య

సెమిస్టర్ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

కర్నూలు (న్యూసిటీ) : రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో 2022 సంవత్సరం సెప్టెంబర్, అక్టోబర్‌లో జరిగిన డిగ్రీ రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను శుక్రవారం వైస్ చాన్సలర్ ఆచార్య ఎ.ఆనందరావు విడుదల చేశారు. డిగ్రీ రెండవ సెమిస్టర్ పరీక్షకు 2,697 మంది విద్యార్థులు హాజరుకాగా 419 మంది, నాలుగో సెమిస్టర్ 2,692 మంది రాయగా 700 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఫలితాల కోసం విద్యార్థులు https://rayalaseemauniversity.ac.in.లో చూడాలన్నారు.

శిక్షణకు కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): హైదరాబాద్‌లో ప్రభుత్వం నిర్వహించే ఆర్థిక వ్యవహారాల శిక్షణకు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ వెళుతున్నారు. ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు 5 రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ శిక్షణకు ప్రభుత్వం కర్నూలు కమిషనర్‌ను ఎంపిక చేసింది. దీంతో అడిషనల్ కమిషర్ రామలింగేశ్వర్ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా వ్యవహరిస్తారని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శ్రీ లక్ష్మి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆర్‌టీసీ ఏఓగా ప్రభాకర్ మోజెస్

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ప్రాంతీయ శిక్షణ కేంద్రం(ఫిమేల్) ఏఓగా ఎం. ప్రభాకర్ మోజెస్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. అనంతపురం జిల్లాలోని ప్రాంతీయ శిక్షణ కేంద్రం ఏఓగా విధులు నిర్వహిస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా కర్నూలు వచ్చారు. ఆయనను ప్రభుత్వ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, నాయకులు గోవిందు, మధుసూదన్‌రావు, అమ్జాద్‌బాషా, మద్దిలేటి, మహబూబ్‌బాషా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

యోగాతో ఒత్తిడి దూరం

కర్నూలు(రాజ్‌విహార్): రోజు వారి పని ఒత్తిడిని తగ్గించుకునేందుకు యోగా చక్కగా ఉపయోగపడుతుందని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక విద్యుత్ భవన్‌లో ఉద్యోగులకు యోగా, మెడిటేషన్ కార్యక్రమం నిర్వహించారు.

టిడ్కో రుణ మేళాను వినియోగించుకోవాలి

కర్నూలు (టౌన్): గృహ లబ్ధిదారులు టిడ్కో రుణమేళాను సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. శుక్రవారం స్థానిక నగర పాలక కౌన్సిల్ హాలులో టిడ్కో గృహాలకు రుణా మేళా నిర్వహించారు. ఈ మేళాలో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంకు, యూనైటెడ్ కమర్షియల్ బ్యాంకు, బ్యాంకు ఆఫ్ ఇండియా అధికారులు పాల్గొన్నారు. నగరంలోని వివిధ కాలనీల్లో ఉన్న లబ్ధిదారులు ఈ మేళాకు తరలి వచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీ రమాదేవి, మెప్మా పీడీ నాగశివలీల, మెప్మా అధికారులు మురళీ, సుధాకర్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం పూర్తిగా ఇవ్వాల్సిందే

కర్నూలు(లీగల్) : ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) కింద ప్రీమియం చెల్లించిన రైతులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం ఇవ్వాల్సిందేనని ఓరియంటల్, బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థలకు వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు కె.కిషోర్ కుమార్, సభ్యులు ఎస్.నారాయణరెడ్డి, నజీమా కౌసర్‌తో కూడిన బెంచ్ శుక్రవారం ఆదేశించింది. వివరాల్లోకి వెళ్తే... కర్నూలు మండలం ఉల్చాల, బసవాపురం గ్రామానికి చెందిన పలువురు రైతులు 2018 రబీ, ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటలకు పీఎంఎఫ్‌బీవై కింద బీమా చేసుకున్నారు. ఇందుకు ఓరియంటల్, బజాజ్ ఇన్సూరెన్స్ సంస్థలకు ప్రీమియం చెల్లించారు. వర్షాలు లేక ఆ ఏడాది పంట పూర్తిగా నష్టపోయారు. దీంతో బీమా పాలసీ ప్రకారం తమకు పూర్తి నష్టపరిహారం చెల్లించాలని 12 మంది రైతులు బీమా సంస్థలను కోరారు. అయితే పంట పూర్తిగా నష్టపోలేదని, అధికారిక నివేదిక ప్రకారం దిగుబడి కొంత శాతం మాత్రమే తగ్గిందంటూ రూ.5.12 లక్షలకు గాను రూ.45 వేలు మాత్రమే సదరు బీమా సంస్థలు చెల్లించాయి. దీనిపై వారు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించగా 12 మంది రైతులకు రూ.5.12 లక్షలను 2018 సంవత్సరం నుంచి 9 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని బీమా సంస్థలకు ఆదేశిస్తూ తీర్పు వెల్లడించింది.

సంక్షిప్త సమాచారం

గడప గడప పనుల్లో వేగం పెంచండి

కర్నూలు(రాజ్‌విహార్): గడప పడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన విన్నపాల పరిష్కారంలో వేగం పెంచాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఉద్యోగులపై ఒత్తిడి తగ్గించాలి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలని విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ ట్రాన్స్‌కో అధ్యక్షుడు ఎస్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి ఆ సంఘం కార్యాలయంలో ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించి మాట్లాడారు. కర్నూలు ఎస్ఈ కింది స్థాయి సిబ్బందిపై ఒత్తిడి పెంచుతున్నారని, ఆయనలో మార్పు రానిపక్షంలో జిల్లా సమావేశం నిర్వహించి కార్యాచరణ రూపొందిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యా సదస్సును జయప్రదం చేయండి

కర్నూలు సిటీ: ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్న విద్యా సదస్సును జయప్రదం చేయాలని ఆప్టా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మధుసూదన్ రెడ్డి, రమావత్ సేవాలాల్ నాయక్ శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ రూపొందించడానికి జెడ్పీ మీటింగ్ హాల్‌లో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

- ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయడం లేదని ఎస్టీయూ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు గోకారి, అజాం బేగ్ అన్నారు. స్థానిక సలాంఖాన్ భవనంలో నిర్వహించిన ఎస్టీయూ కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలివ్వాలి

కర్నూలు సిటీ: ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ విద్యార్థి సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్మీడియేట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్లా, నాయకులు అమర్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ జాబితాలో చేర్చండి

కర్నూలు(అర్బన్): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2009లో బీసీ (డీ) జాబితాలో చేర్చిన వీరశైవ లింగాయత్/ లింగ బలిజలను ఓబీసీ జాబితాలో చేర్చాలని జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం అందించినట్లు వీరశైవ ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి జి. చంద్రశేఖరప్ప తెలిపారు. కేంద్ర ప్రభుత్వం లింగాయత్‌లను ఓబీసీ జాబితాలో చేర్చకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లోని నియామకాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కమిషన్‌ను కలిసిన వారిలో వేదిక సభ్యులు ఈశ్వర వీరభద్ర స్వామి దేవాలయం చైర్మన్ జీ వీరేంద్రకుమార్, గట్టు వీరన్న, గుడారం గణేష్, జీ రూపేశ్వర్ ఉన్నారన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

కర్నూలు(టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని జోహరాపురం షరీక్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం నాయకులు రాముడు, గౌస్ దేశాయ్, రాజశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ ఎదుట ఆ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సాయిబాబా, నరసింహులు, సుధాకరప్ప విజయ్, అబ్దుల్ పాల్గొన్నారు.

ఎకరాకు రూ.10 వేలు ఇవ్వాలి

కర్నూలు(రూరల్): రైతాంగానికి సాగు పెట్టుబడి కింద ఎకరాకు రూ.10 వేలు ఆర్థిక సహాయం చేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి పి.జగన్నాథం డిమాండ్ చేశారు. నగరంలోని సీఆర్ భవనంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, రైతు సంఘం నాయకులు పుల్లన్న, నగర సహాయ కార్యదర్శులు శ్రీనివాసరావు, మహేష్, ఖాజా హుసేన్, బాబయ్య పాల్గొన్నారు.

దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించాలి

కర్నూలు (రూరల్): ఎస్సై, కానిస్టేబుల్ ప్రాథమిక పరీక్షల్లో అర్హత సాధించిన వారికి వెంటనే దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్ డిమాండ్ చేశారు. నగరంలోని సుందరయ్య భవనంలో శుక్రవారం డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు.